సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటా

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీనియర్ సిటిజన్స్‌కు అండగా ఉంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం మెట్టుగడ్డలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో కొత్త ఏడాది పాకెట్ డైరీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైతులకు రుణమాఫీ చేసిందని, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తున్నామన్నారు. విద్యానిధికి రూ.పది లక్షల వరకు విరాళాలు అందాయని, ఈనిధి నుంచి కొనపాలమూరు ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామన్నారు. అనంతరం ఆయనను సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. అంతకుముందు కోయిల్‌కొండ ఎక్స్ రోడ్‌లోని శ్రీరామాంజనేయస్వామి ఆలయం ఆవరణలో ముడా నిధులతో ఏర్పాటుచేసిన ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రీ, ఎస్.పి.వెంకటేష్, ఎస్.వినోద్‌కుమార్, బాలయ్య, ఎస్.విజయ్‌కుమార్, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు జగపతిరావు, నారాయణరావు, రాజసింహుడు, సురేష్, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలతో మంచి ఫలితాలు

• మండల వ్యవసాయాధికారి నరేందర్



మహమ్మదాబాద్: రబీలో సాగుచేసిన వరి పంటకు సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి నరేందర్ తెలిపారు. బుధవారం మండలంలోని జూలపల్లి గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రబీలో సాగు చేసిన పంటకు అగ్గి తెగులు సోకకుండా వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ నిఖిత, నారాయణ, ఎల్లయ్య పాల్గొన్నారు.

డప్పులు అందజేత



దేవరకద్ర: లక్ష డప్పులు–వేలగొంతుకలు కార్యక్రమానికి మద్దతుగా బుధవారం మండలంలోని చిన్నరాజమూర్‌లో జీకేఆర్ ఫౌండేషన్ సహకారంతో మాదిగలకు 22 డప్పులు అందజేశారు. జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిబాబ వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, వెంకటనర్సింహులు, రాజుగౌడ్, చెన్నప్ప, రాము, రాజు, తిమ్మన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



నవాబుపేట: తాగునీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేందుకే గ్రామాల్లో అధికారులు పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. బుధవారం ఆయన మండల అధికారులతో కలిసి రుద్రారం, మల్లారెడ్డిపల్లి, హన్మసానిపల్లి, కారుకొండ గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలు తెలుసుకున్నారు. వేసవిలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

కోయిల్‌కొండ: నులిపురుగులు నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ నరేష్ చంద్ర అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు పిల్లలకు మాత్రలను మింగించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శరత్‌బాబు, సంగీత, బీరయ్య, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కేంద్ర బడ్జెట్

• బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్



పాలమూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు అండగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మూడు కోట్ల 92లక్షల జనాభా ఉన్న బీసీలను మూడు కోట్ల యాభై లక్షలుగా తక్కువ చేసి చూపించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు రాజ్యాధికారం దూరం చేయడానికి కుట్ర చేస్తోందని ఆరోపించారు. కులగణన నివేదిక బాధ్యతను బీసీ అయిన పొన్నం ప్రభాకర్‌కు ఇవ్వకుండా ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఎలా ఇస్తారన్నారు. అంజయ్య, నంబిరాజు, ఆంజనేయులు, సూర్యనారాయణ, శ్రీకృష్ణ, మఠం మయూరినాథ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని బైక్ దగ్ధం

జడ్చర్ల: గుర్తుతెలియని మోటార్ బైక్ దగ్ధమైన ఘటన పత్తి మార్కెట్ యార్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం వెలుగులోకి వచ్చింది. జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిని అనుసరించి దాదాపు అర కిలోమీటర్ లోపలకు ఉన్న పత్తి మార్కెట్‌కు రాకపోకలు సాగించేందుకు వీలుగా మధ్యలో డివైడర్ నిర్మాణం ఉన్న సీసీ రోడ్ ఉంది. సీసీ రోడ్డుపై ఓ పక్కగా గుర్తు తెలియని మోటర్ బైక్ పూర్తిగా దగ్ధమైన స్థితిలో ఉండగా మార్కెట్ యార్డు సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ బైక్ ఎవరిది, ఎవరు దగ్ధం చేశారన్న విషయాలు తెలియాల్సి ఉంది. బైక్ దగ్ధంపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ



హన్వాడ: స్థానిక ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి యువన్‌రాజ్ తను సొంతంగా దాచుకున్న డబ్బులతో పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు బూట్లను అందజేశా రు. ఈసందర్భంగా తహసీల్దార్ కిష్ట్యానాయక్ యువన్‌రాజ్ సేవాభావం, ఉదారతను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోద, ఎంఈఓ గోపాల్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి దీప్తి, హెచ్‌ఎం లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

మిగులు భూమిని రైతులకు ఇవ్వాలి



హన్వాడ: మండల కేంద్ర శివారులోని 718 సర్వేలో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని రైతులకు ఇవ్వాలని తెలంగాణ వృత్తిదారుల యూనియన్ డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆయూనియన్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈమేరకు తహసీల్దార్ కిష్ట్యానాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆయూనియన్ కార్యదర్శి నాగన్న, వెంకటయ్య, నాయకులు జ్యోతి, రాజు, శ్రీనివాసులు, హేమ్లి, మౌనిక, నీలమ్మ, లక్ష్మణ్‌నాయక్, సురేష్, గోవింద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన తహసీల్దార్

మహబూబ్‌నగర్ రూరల్: ఏనుగొండ రెవెన్యూ శివారు సర్వే నంబర్ 431లో గల ప్రభుత్వ భూమిని అర్బన్ తహసీల్దార్ ఘన్సీరాంనాయక్ బుధవారం పరిశీలించారు. ఏనుగొండకు చెందిన 30కుటుంబాలు 20 ఎకరాల విస్తీర్ణంలోగల ప్రభుత్వ భూమిని సాగుచేస్తూ జీవనం సాగించేవారు. గుట్ట, ముళ్లకంపలతో ఉన్న ఆభూమిని మూడు తరాలుగా కష్టపడి చదునుచేసి వ్యవసాయానికి అనుకూలంగా చేసుకొని పంట సాగు చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు ఆభూమిలో కందకాలు తీయించి చెట్లు నాటే ప్రయత్నం చేశారు. ఈ విషయమై బాధిత రైతులు ఇటీవలే కలెక్టర్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. దీంతో ఆమె విచారణకు ఆదేశించారు. ఆమేరకు తహసీల్దార్ ఆభూమిని పరిశీలించారు. తమ పూర్వీకులు నాటిన మామిడి, చింత చెట్లను తహసీల్దార్‌కు బాధిత రైతులు చూపించి సాగుకు అనుమతివ్వాలని కోరారు. తహసీల్దార్ వెంట గిర్దావర్ నర్సింగ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పీయూలో నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ జనాభాను తక్కువ చేసి చూపిందని బీసీ విద్యార్థి సంఘం నాయకుడు తాయప్ప ఆరోపించారు. బుధవారం పీయూలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, కేశవులు, బడేసాబ్, అజయ్, బాబు, సాయిబాబు పాల్గొన్నారు.

శివస్వాములకు ముస్లిం యువకుల అన్నదానం



భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గరకి చెందిన ముస్లిం యువకులు ముజీబ్, మక్బూల్, ఖాజా, ఖాసీంలు బుధవారం కొత్తమొల్గర దేవాలయంలో కప్పేట, కొత్త మొల్గర, పాత మొల్గర గ్రామాలకు చెందిన శివస్వాములకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఏటా శివ స్వాములకు ఒకరోజు అన్న ప్రసాదం అందిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మురళీ, సాయి. చింటూ, వెంకటేష్ ఉన్నారు.

‘నవోదయ’ స్కూల్ కోసం స్థల పరిశీలన

గండేడ్: మండల కేంద్రానికి అనుకొని ఉన్న జంగంరెడ్డిపల్లి సమీపంలో ఉన్న స్థలాన్ని జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. 25 ఎకరాల స్థలం అవసరం ఉండగా పాఠశాల ఏర్పాటుకు సరిపోయేంత స్థలం ఉందా లేదా అని ఆయన ఆరాతీశారు. దీనికి చుట్టుపక్కల రైతుల నుంచి, ఇతరుల నుంచి ఏమైనా సమస్యలున్నాయా అని తహసీల్దార్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఏర్పాటుకు ఇంకా భూమి అవసరమవుతందని, దానికోసం ప్రయత్నించాలని తహసీల్దార్‌ను ఆయన ఆదేశించారు. ఆర్‌ఐ యాసిన్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య ఉన్నారు.



నవోదయ పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు

పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి

రాజాపూర్: రైతులు తాము సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఈద్గాన్‌పల్లి, రంగారెడ్డిగూడ, రాజాపూర్ గ్రామాల్లో రైతులు సాగుచేసిన వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల వివరాలను డిజిటల్ క్రాప్ బుకింగ్ యాప్‌లో జీపీఆర్‌ఎస్ లోకేషన్‌ద్వారా నమోదుచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను గ్రామాల క్లస్టర్ విస్తరణ అధికారులు ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారన్నారు. రైతులు సహకరించాలని కోరారు. ఏఈఓ శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, దీపిక, రైతులు ప్రభాకర్‌రెడ్డి, మల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఈద్గాన్‌పల్లిలో యాప్‌లో పంటను నమోదు చేస్తున్న వ్యవసాయాధికారి ప్రదీప్‌గౌడ్

విగ్రహాలను సముచిత స్థానంలో ఏర్పాటుచేయాలి

• అఖిలపక్ష నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి తదితరులు

జడ్చర్ల: స్థానిక సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులకు అడ్డంకిగా భావిస్తున్న జాతీయ మహనీయుల విగ్రహాలను సముచిత స్థానంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సిగ్నల్‌గడ్డ వద్ద అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, శ్రీకాంతాచారి ఓవైపు ఉండగా నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలు మరోవైపు ఉన్నాయి. ఈ విగ్రహాలను ఇక్కడి నుంచి తొలగించాలని జాతీయ రహదారుల అధికారులు ఇప్పటికే మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం అంబేడ్కర్ కళాభవన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి అభిప్రాయాలను సేకరించారు. ప్రస్తుతం ఉన్న దగ్గరే విగ్రహాలను ఏర్పాటుచేయాలని చాలామంది కోరారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ రహదారిని అనుసరించి ఏర్పాటు చేయాలని మరికొందరు సూచించారు. కళాశాల, హైస్కూల్ ఆవరణలో రహదారిని అనుసరించి ఏర్పాటుచేయాలని ఇంకొందరు కోరారు. సమస్యను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలని కొందరు సూచించారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, రఘుగౌడ్, లత, నందకిషోర్, రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు జంగయ్య, నాగరాజు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ జెడ్పీటీసీ శివకుమార్, మాజీ ఎంపీపీ నిత్యానందం, మాజీ సర్పంచ్ రేణుక, రామ్మోహన్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణ కాంగ్రెస్ ఎస్సీసెల్, ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీ కులగణనకు సానుకూల చర్యలు తీసుకుంటుండడం అభినందనీయమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణ కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఏర్పుల నాగరాజు, ఓబీసీ విభాగం అధ్యక్షుడు బండి మల్లేష్, నాయకులు అజ్మత్‌అలీ, మహేష్, జగదీష్, రాంచంద్రయ్య, గంజి ఆంజనేయులు, మురళీధర్‌గౌడ్, శంకర్, శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, మురళీ, కృష్ణయ్య, పీర్ మహ్మద్, చంద్రమౌళి, యాదయ్య, నాగయ్య పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకున్నాం

మహమ్మదాబాద్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముకుందం, లక్ష్మయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, పాల్గుణ, విష్ణువర్ధన్, మైబయ్య పాల్గొన్నారు.



సీఎం, నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు..

అడ్డాకుల: స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశా రు. తోట శ్రీహరి, జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శరత్‌కుమార్‌రెడ్డి, షఫీఅహ్మద్, శకుంతల, పరుషరాములు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణను తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించినందుకు గాను ఎమ్మార్పీఎస్ (ఆర్‌ఆర్) ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి నివేదికను ప్రవేశపెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, డాక్టర్ నాగయ్య, ఎల్.రమేష్, మల్లెల రాజశేఖర్, తిరుమలయ్య, అనిల్, నరేష్, బొర్ర సురేష్, నరసింహా, ఉస్కిళ్ల వెంకట్రాములు, పాతూరు రమేష్, యాదగిరి, వినోద్, గిరి, దినేష్, శేఖర్, శివ, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

చిన్నచింతకుంట: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలో దళిత సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు శేఖర్, శాంసన్, పిలోగు, వెంకటన్న, సుందర్‌రావు, అగస్టిన్, మలగర్, ఎనోష, అబ్రహాం తదితరులు ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లో సంబరాలు జరుపుకొంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో చెన్నకేశవ స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నుంచి దేవాలయంలో అఖండ భజనలు చేశారు. బుధవారం తెల్లవారుజామున 4గంటలకు చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తిని రథంపైకి చేర్చారు. భాజభజంత్రీల మధ్య దేవాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం పోచమ్మ దేవాలయం వరకు ఉదయం 7గంటల వరకు కొనసాగింది. అక్కడినుంచి తిరిగి దేవాలయం వరకు రథంను భక్తులు, శివస్వాములు లాగారు. స్వామివారి పల్లకి సేవను ఘనంగా నిర్వహించి చక్రస్నానం చేయించారు. దేవాలయం వద్ద వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.



దేవరకద్రలో చెన్నకేశవస్వామి రథోత్సవం

రాచాల గ్రామంలో..

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామంలో వెలిసిన శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో తీసుకు వచ్చిన పండితులు వాటిని చిన్నతేరులో ఉంచారు. భక్తులు దాన్ని స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తేరును చెన్నకేశవస్వామి దేవాలయం వద్దకు తీసుకొచ్చి ఉత్సవ విగ్రహాలను ఆలయంలోకి తీసుకెళ్లారు.

అలరించిన ఉద్దాలోత్సవం

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఉద్దాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న ఆలయంనుంచి ఉద్దాలను బయటకు తీశారు. చెన్నకేశవస్వామి నామస్మరణ మధ్య వాటిని ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జాతరను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో మిఠాయి, చిన్నపిల్లల ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి.



రాచాలలో చెన్నకేశవస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

‘బీసీ కులగణన ఓ చారిత్రాత్మకం’

స్టేషన్ మహబూబ్‌నగర్: భారతదేశ చరిత్రలో బలహీన వర్గాల కులగణన సర్వే రిపోర్టును బహిర్గతం చేసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్‌హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మతాల్లోని వారి లెక్కలు పక్కాగా బహిర్గతం చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో సమగ్ర సర్వే ఒక్కరోజులో చేశామని గొప్పలు చెబుతున్న అప్పటి పాలకులు ఎందుకు ఆనర్వేను బహిర్గతం చేయలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సమర్థవంతంగా కులగణన ప్రకారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించి నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కంటి వైద్యశిబిరం

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. బుధవారం హైదరాబాద్ శంకర్ కంటి ఆస్పత్రి, వెన్నాచేడ్ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి దేవాలయ ఆవరణలో నిర్వహించిన శిబిరంలో 130మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 59మందికి ఆపరేషన్లు అవసరం ఉండగా వారిని హైదరాబాద్‌కు తరలించారు. మిగతావారికి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సభ్యులు నరేందర్‌రెడ్డి, రాములు, విజయమ్మ, బుగ్గయ్య, మల్లికార్జున్, వైద్యురాలు నాజియ, ఆస్పత్రి ఇన్‌చార్జ్‌లుపాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి బడ్జెట్ ఆమోదం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పలు గ్రంథాలయాల అభివృద్ధికి బడ్జెట్‌ను ఆమోదించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవాబ్‌పేటతో పాటు కొత్త మండలాలైన రాజాపూర్, మూసాపేట మండలాల్లో కొత్తభవనాలు నిర్మిచేందుకు రూ.2.50 కోట్లను వెచ్చిస్తురన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ మరమ్మతులకోసం రూ.30 లక్షలు, అవసరానికి తగిన డిమాండ్ పుస్తకాలను కొనుగోలుకోసం రూ.5లక్షలు, పబ్లిక్ రీడింగ్‌రూం నిర్మిచేందుకు రూ.40 లక్షలను కేటాయించేందుకు ఆమోదించామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి మనోజ్, పాలకవర్గ సభ్యులు డీపీఆర్‌ఓ శ్రీనివాస్, నుమాన్, సంపత్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

నేడు సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం కల్యాణం జరిపించనున్నట్లు సేవాసమితి సభ్యులు తెలిపారు. ఉదయం ఆంజనేయ స్వామి హోమంచేసి కల్యాణానికి అన్నిఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. బుధవారం చండీయాగం, గరుడవాహన సేవలు చేశారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

అడ్డాకుల: మండలంలోని రాచాల గ్రామంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన దేవరకద్ర నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఆలయ ధర్మకర్త గొని చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ పాశం తిరుపతయ్య యాదవ్ ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. గురువారం కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. గ్రామస్తులు చక్రధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాము, బొక్క శ్రీను, జగన్ ఉన్నారు.

పీయూలో పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ (పీయూ) ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు ప్రభాకర్‌రెడ్డి రాసిన ‘గ్లోబల్ రెగ్యులరిటీ నియమ నిబంధనలు, అడ్వాన్స్ టాపిక్స్’ అనే పుస్తకాన్ని వీసీ శ్రీనివాస్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా రంగంలో నూతన పోకడలను వివరిస్తూ ప్రభాకర్‌రెడ్డి రాసిన పుస్తకం చాలా బాగుందన్నారు. రిజిస్ట్రార్ చెన్నప్ప, అధ్యాపకులు ప్రవీణ, కరుణాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శీలాస్, వెంకటేష్, రవికుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా జయలక్ష్మి బాధ్యతల స్వీకరణ

భూత్పూర్: తహసీల్దార్‌గా జె. జయలక్ష్మి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట జిల్లా నుంచి భూత్పూర్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రహమాన్ బదిలీపై వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మమత డీఎస్‌ఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లగా మూసాపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పనిచేస్తున్న రవికుమార్ భూత్పూర్ సీనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు.

రేషన్ కార్డుల సర్వే



గండేడ్: మండలంలోని సల్కర్‌పేట్ గ్రామంలో రేషన్‌కార్డుల సర్వే కొనసాగుతుంది. తహసీల్దార్ మాధవి నేతృత్వంలో రెవెన్యూ బృందం బుధవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. ప్రజాపాలనలో, గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. ముందుగా సల్కర్‌పేట్ గ్రామంలో సర్వే చేస్తున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా ఉన్నారా.. రేషన్‌కార్డులో పేరున్నా డబుల్ అప్‌లై చేశారా అన్న అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆర్‌ఐ యాసిన్, సీనియర్ అసిస్టెంటు చైతన్య, జూనియర్ అసిస్టెంట్లు నర్సింహులు, సత్తయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

బీసీలను అణిచివేసేందుకు కుట్ర



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలను అణిచివేసేందుకు కుట్ర చేస్తుందని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ జనాభాపై ప్రభుత్వం తప్పుడు సర్వే లెక్కలు చూపుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర సర్వే చేయిస్తామని చెప్పి సర్వేలో తప్పుడు లెక్కలతో మరోసారి బీసీ సమాజాన్ని మోసం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. లక్ష్మీ, హరిప్రి య, లావణ్య, భాగ్యలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):ఎస్సీలకు వర్గీకరణ ప్రకారం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బిచ్చారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. ఎస్సీ నిరుద్యోగ స మస్యను పరిష్కరించి వారికి జీవించే హక్కును క ల్పించాలని పేర్కొన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని కోరారు.